విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 116 | మంగళవారం 25. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## న్యాయసేతు అనేది ఒక వారధి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన సీజేఐ



## విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

- ఇకపై 'ఈ-బోర్డింగ్ పాస్' ఉంటే చాలు!
- ఎయిర్‌పోర్టుల వద్ద బోర్డింగ్ పాస్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇకపై ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడి





## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ తీర్మానం
- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం



### మెట్రో రెండో దశలో సరికొత్త

## హంగులు

- ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం
- మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు
- హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం
- మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్

హైదరాబాద్

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసిం గ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్? నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్‌ఎం డీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి 1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ - మిగతా3లో




# తెలంగాణపై ఏంటీ వివక్ష?

## గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. నన్ను అడ్డుకుంటారా?

- తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికా పర్యటన
- సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం
- ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారు
- పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు
- "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం.
- విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను.
- బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది.
- పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం.
- కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు.
- నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు.
- విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం
- యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం.
- కేంద్రం నన్ను అడ్డుకున్నా, నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం.
- హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం.
- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది.

హైదరాబాద్ తెలంగాణ వాణి)
వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరిం చడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు.



### న్యాయమూర్తులు

## దేవుళ్లు కాదు

- ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు
- జస్టిస్ సంజయ్ కరోల్
- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

## కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ

- కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ హైదరాబాద్ జలసౌధలో భేటీ
- కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం
- శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చ
- కృష్ణా బోర్డుకు లేఖ రాయగా తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని నిర్ణయం
- తరువాత 17కు వాయిదా పడగా ఏపీ శాసనసభ సమావేశాల నేపథ్యంలో మళ్లీ వాయిదా

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, సామాజిక పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నారు.

# వీరి ధీమా తోటే అక్రమ గంజాయి స్మగ్లర్ల విచ్చలవిడి వ్యాపారం?

**ఉమ్మడి నిజామాబాద్ ఆగస్టు 23, టిఎన్ రమేష్**

**తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్)**

నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలలో, పోలీసు ఉన్నత అధికారులు డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, డైజోఫాం, అల్పజోలం దందాలపై ఉక్కు పాదం మోపుతున్నారనేది వాస్తవికత. వనాలు లేకుండానే, చారణ కల్లు సేకరించి భారాన దందా చేస్తున్న, కల్లుముస్తేదారులు, ప్రాణాంతకమైన డైజోఫామ్, అల్పజోలంతో, కృత్రిమ కల్లు తయారు చేసి, అమ్మకాలు కొనసాగిస్తున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. కృత్రిమ కల్లు తయారుచేసి, మూస్తే దారులు ఏట వందలాది మంది గోస పుచ్చుకుంటున్నారు. పేద మధ్యతరగతి ప్రజలు కల్తీ కల్లు సేవించి, అనేక మంది అనారోగ్యాల బారిన పడడా నికి, పదుల సంఖ్యలో పేద, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడడానికి, కల్తీ కల్లు వ్యాపారులు,పరోక్ష కంగా కారణమవుతున్నారనేది, పేద ప్రజల వాదన. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వినిపిస్తున్న అతి ప్రధానమైన విమర్శ సహితం ఇదే. ఇక అక్రమ గంజాయితోపాటు, డైజోఫామ్, అల్ప్రోజోలం అమ్మకాలు చేస్తున్న స్మగ్లర్ల గ్రామాల చిట్టా..

**నిజామాబాద్ అర్బన్ లో 14 మంది నిషేధిత అల్ప్రాజోలం మత్తు పదార్థాల సప్లైదారులు.**

గంజాయి అక్రమ రవాణా స్మగ్లర్లు 11 మంది (వీరు పెద్ద మొత్తంలో అక్రమ గంజాయి రవాణా చేసే ప్రధాన ఫెడ్లర్లు) నిజామాబాద్, నిర్మల్ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన భాసర, నిజామాబాద్ ఏరియా చెక్ పోస్ట్, నవీపేట్ ప్రాంతాలలో, చెక్ పోస్ట్ దాటి, నిషేధిత, అల్పజోలం, అక్రమ గంజాయి రవాణా పెద్ద మొత్తంలో జిల్లాలోకి వస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం.
ఆర్మూర్ లో డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ముగ్గురు. అక్రమ గంజాయి స్మగ్లర్ల ఐదుగురు. భీంగల్ లో డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ఐదుగురు. గంజాయి అక్రమ రవాణా దారులు ముగ్గురు. బోధన్ లో డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ఆరుగురు. గంజాయిస్ స్మగ్లర్లు 8 మంది. నిజామాబాద్ రూరల్ లోని, డిచ్పల్లి లో డైజోఫాం, అల్ప్రాజోలం సప్లై దారులు ముగ్గురు. అక్రమ గంజాయి సరఫరాదారులు ఐదుగురు. ఇందల్వాయి, గన్నారం పరిధిలో, డైజోఫామ్, అల్పజోలం విక్రతలు ఇద్దరు. గంజాయి స్మగ్లర్లు ఇద్దరు. వర్నిలో అల్పజోలం స్మగ్లర్లు ఇద్దరు. గంజాయి స్మగ్లర్లు - 0
కామారెడ్డి జిల్లాలో, కామారెడ్డి జిల్లా కేంద్రంలో, డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ఆరుగురు (ఇందులో పేరు మోసిన బడా స్మగ్లర్లు ఇద్దరు) గంజాయి సరఫరాదారులు ఐదుగురు (బడా స్మగ్లర్లు పట్టణానికి చెందిన వారు ఇద్దరు, కామారెడ్డి రూరల్ ప్రాంతానికి చెందిన వారు ముగ్గురు.)
బాన్సువాడలో డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ముగ్గురు. గంజాయి సరఫరాదారులు మండల వ్యాప్తంగా నలుగురు. బీర్కూర్ మండల కేంద్రంలో డైజోఫామ్, అల్పజోలం సరఫరాదారులు ముగ్గురు. గంజాయి సరఫరాదారులు ఇద్దరు. బిచ్కుంద డైజోఫామ్, అల్పజోలం సరఫరాదారులు ముగ్గురు. అక్రమ గంజాయి అమ్మకం దారులు పదిమంది. జుక్కల్, కాంగ్టి, తడకల్ ప్రాంతంలో డైజోఫామ్, అల్ప్రాజోలం అమ్మకం దారులు ఇద్దరు. అక్రమ గంజాయి సరఫరాదారులు ఆరుగురు. పిట్లం లో డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ఇద్దరు. అక్రమ గంజాయి స్మగ్లర్లు మండల వ్యాప్తంగా ఐదుగురు. వాజిద్ నగర్ ప్రాంతంలో నిషేధిత గుల్పారం, ఆల్ప్రాలోలం అమ్మకం దారులు ఒక్కరు. నిషేధిత అక్రమ గంజాయి సరఫరాదారులు ముగ్గురు. గాంధారి మండలంలో నిషేధిత డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ముగ్గురు. నిషేధిత అక్రమ గంజాయి సరఫరాదారులు 12 మంది. ఎల్లారెడ్డి మండలం మీసాన్పల్లిలో నిషేధిత డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ముగ్గురు. అక్రమ గంజాయి సరఫరాదారులు - 0 -ఎల్లారెడ్డి మండలం పెద్ద రెడ్డి లో డైజోఫామ్, అల్పజోలం సరఫరాదారులు ఒక్కరు. గంజాయి విక్రయితలు -0
దాల్మల్కా పల్లె లో నిషేధిత డైజోఫామ్, అల్ప్రాజోలం సరఫరాదారులు ఒక్కరు. అక్రమ గంజాయి సరఫరాదారులు - 0

**కొసమెరుపు..**

గత రెండేళ్ల క్రితం ఇందల్వాయి మండలంలో ఒక కళ్ళు మూస్తే దారును కల్తీ కల్లు అమ్మకాలు నిర్వహించకూడదని, హైవే పక్కన అసలే నిర్వహించకూడదని గ్రామస్తులు ఎదిరించి, కొద్ది రోజులపాటు కృత్రిమ కల్లు అమ్మకాలకు అంతరాయం కలిగించడం జరిగింది. దీంతో అక్కడికి సంబంధిత ఎక్సైజ్ శాఖ ఎస్ హెచ్ ఓ వచ్చి పరిశీలించడం కూడా జరిగినది. కానీ ఇందల్వాయి మండలంలో జరుగుతున్న బహిరంగ కల్తీకల్లు అమ్మకాల విషయమై సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారికి ఒకరు ఫోన్ చేసి మాట్లాడగా, అట్టి విషయాన్ని సదరు అధికారి కల్లుమాముల ముస్తేదారు(అల్ప్రాజోలం వ్యాపారి)కి విషయం చేరవేయడం జరిగింది. మరుసటి రోజు సదరు ముస్తదారు అధికారికి ఫోన్ చేసిన వ్యక్తిని పిలిచి, నీకేమైనా కావాలంటే నన్ను అడుగు సార్ కు ఫోన్ చేయొద్దు అని అనడం ఈ మొత్తం కథలో కోసమేరుపు.
ఈ స్థాయిలో కొందరు అధికారులు తమ స్వార్థం, స్వలాభం కొరకు ఉద్యోగ ధర్మానికి తూట్లు పొడుస్తూ ప్రజల ప్రాణాలను గాలికి వదులుతూ, తూతూ మంత్రంగా(అక్రమార్కులతో చేతులు కలిపి) ఉద్యోగాలు వెళగబెడుతుంటే, జిల్లాస్థాయి పై అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అన్యాయాన్ని, అక్రమాలను నియంత్రించడం ఎలా సాధ్యమవుతుందని ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. రేపటి సంచికలో కృతిమ కల్తీ కళ్ళు అక్రమ గంజాయిస్మ రవాణా పై మరో కథనంతో మళ్ళీ కలుద్దాం!

# కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు

## వామపక్ష ఉద్యమానికి, రైతాంగ పోరాటానికి తీరని లోటు




హైదరాబాద్, ఆగస్టు 24: సిపిఎం సీనియర్ నాయకులు, అఖిల భారత కిసాన్ సభ సీనియర్ నేత, రైతాంగ ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, తెలంగాణ రైతాంగ పోరాటానికి తీరని లోటని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఆయన మరణం పట్ల పార్టీ తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, కామ్రేడ్ మల్లారెడ్డికి విప్లవ జోహార్లు అర్పించింది. ఆయన కుటుంబ సభ్యులకు, సహచరులకు, సిపిఎం శ్రేణులకు, రైతు ఉద్యమ కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. దశాబ్దాలుగా రైతాంగ సమస్యలను తన రాజకీయ జీవితంలో ప్రధాన అంశంగా చేసుకుని పనిచేసిన కామ్రేడ్ మల్లారెడ్డి రైతుల భూమి, సాగునీరు, గిట్టుబాటు ధర, పంటల మార్కెటింగ్, రుణభారం, పంట నష్టపరిహారం వంటి సమస్యలపై నిరంతరం పోరాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం తక్షణ ఉపశమన చర్యల కోణంలో కాకుండా, వ్యవసాయ రంగంలో పెరుగుతున్న కార్పొరేటీకరణ, మార్కెట్ ఆధిపత్యం, ప్రభుత్వ విధానాలతో అనుసంధానించి చూడాల్సిన అవసరాన్ని ఆయన తన ఉద్యమ కార్యాచరణలో పదేపదే ముందుకు తెచ్చారు.

### రైతు ఉద్యమ నిర్మాణానికి అంకితమైన జీవితం

తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత కిసాన్ సభలతో అనుబంధంగా సుదీర్ఘకాలం పనిచేసిన మల్లారెడ్డి రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. స్థానిక భూ సమస్యలపై రైతు సంఘాలు కేంద్రీకరించాలని, మారుతున్న వ్యవసాయ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు కార్యకర్తలు అధ్యయనం పెంచుకోవాలని ఆయన ఇటీవల కూడా పిలుపునిచ్చారు.

రైతు ఉద్యమం కేవలం పంట ధరల సమస్యకే పరిమితం కాదని, భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ పెట్టుబడులు, మార్కెట్ హామీ, ప్రభుత్వ మద్దతు వంటి అనేక అంశాలతో రైతుల జీవితం ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేసేవారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలంటే ముందుగా మార్కెట్ హామీ కల్పించాలని ఆయన చేసిన సూచనలు రైతాంగ సమస్యలపై ఆయనకున్న లోతైన అవగాహనకు నిదర్శనం.

### రైతుల పక్షాన నిరంతర గళం

రైతుల పంటలకు గిట్టుబాటు ధర, పంట నష్టపరిహారం, రుణ విముక్తి వంటి డిమాండ్లపై మల్లారెడ్డి నిరంతరం ప్రభుత్వాలను ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించేందుకు రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల ఆదాయం, పంటల మార్కెటింగ్, కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఆయన నిరంతరం విమర్శనాత్మకంగా మాట్లాడారు.
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని కూడా ఆయన బలంగా ప్రతిపాదించారు. తెలంగాణ రైతాంగ పోరాటం కుల, మతాలకు అతీతంగా భూస్వామ్య – నిరంకుశ అణచివేతకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటమని ఆయన వివరించారు. ఈ అంశంపై ఆయన రచించిన "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం – ప్రచారాలు, వాస్తవాలు" వంటి రచనలు కూడా అందుబాటులో ఉన్నాయి.

### వామపక్ష ఐక్యతకు స్ఫూర్తిదాయకమైన నాయకత్వం

కామ్రేడ్ మల్లారెడ్డి వ్యక్తిగత జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు. రైతాంగ ఉద్యమంలో అనేక తరాల కార్యకర్తలను తీర్చిదిద్దడంలో, ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించడంలో ఆయన పాత్ర ఉంది. ఇటీవల కూడా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలలో ఆయన సీనియర్ నాయకుడిగా పాల్గొన్నారు.
ఆయన మరణం ఒక వ్యక్తి కోల్పోవడమే కాదు; రైతాంగ ఉద్యమంలో అనుభవం, అధ్యయనం, పోరాట నిబద్ధత కలిగిన ఒక తరాన్ని కోల్పోవడమేనని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది.
కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ, రైతాంగ సమస్యలపై మరింత బలమైన పోరాటాలను నిర్మించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. భూమి, భుక్తి, విముక్తి కోసం, రైతు – కూలీ ఐక్యత కోసం, దోపిడీ రహిత సమాజం కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పార్టీ పిలుపునిచ్చింది.

**కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డికి విప్లవ జోహార్లు!**
**ఆయన పోరాట స్ఫూర్తికి జోహార్లు!**


మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి
సిపిఐ(ఎంఎల్) లిబరేషన్
తెలంగాణ
7893230218




# నేడు జిల్లాలో లక్ష మొక్కల నాటకం

### సెప్టెంబర్ చివరి నాటికి వనమహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయాలి: మంత్రి కొండా సురేఖ




**ఖమ్మం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
వనమహోత్సవంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం జిల్లాలో సామూహికంగా పెద్దఎత్తున మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, డీఎఫ్ఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సెప్టెంబర్ చివరి నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఖమ్మం జిల్లాలో 67 శాతం పూర్తి:**
జిల్లాలో 31.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. మంగళవారం ఒక్కరోజే లక్ష మొక్కలు నాటేలా 2 లక్షలకు పైగా గుంతలు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువతను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు.

# ఏఐకేఎంఎస్ తెలంగాణ 9వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**టేకులపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలం గాణ 9వ మహాసభల పోస్టర్‌ను సోమవారం టేకులపల్లిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. కల్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుపాకుల నాగేశ్వరరావు హాజరయ్యారు. సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో రాష్ట్ర మహాసభలు, 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో కేంద్ర మహాసభలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మంలో రైతు కూలీలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర మహాసభలకు 50 మంది, కేంద్ర మహాసభలకు 25 మంది ప్రతినిధులను ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి తెలిపారు. సమావేశంలో రైతు సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె ఉమర్, భూక్య హర్ష్య , పూనం రంగయ్య,బచ్చలి సారయ్య, గడ్డం లాలయ్య, గుగులోత్ రామచంద్, కొమరం సత్యనారాయణ, మూడ్ మాలు, గోగ్గిల రాజు, కుంజ కృష్ణ, పూనం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# 22ఎ నిషేధిత జాబితాలో రైతుల భూములు

### తక్షణమే సమస్య పరిష్కరించాలి

**కుమురం భీం ఆసిఫాబాద్: ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిది)**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ మాజీ శాసన సభ్యులు కోనేరు కోనప్ప 22ఎ నిషేధిత జాబితా అంశంపై ప్రెస్‌మీట్ నిర్వ హించారు.తెలంగాణలో 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ధరణిలో లోపా లు ఉన్నాయంటూ భూ భారతి చట్టాన్ని తీసుకొ చ్చిందని కోనేరు కోనప్ప పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం 22ఎ కింద నిషేధిత జాబితాలో సుమారు 10,000 మంది పట్టా పాస్ బుక్ లు ఉన్న నిషేధిత జాబితాలో చేర్చారని రైతులు బ్యాంక్ లో లోన్ పెట్టుకున్న రావడం లేదని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తమ భూముల్లో వ్యవసా యం చేసుకుంటున్న రైతుల భూములను సైతం 22ఎ నిషేధిత జాబితాలో చేర్చ డంతో రైతులు తీవ్ర ఆవేద నకు గురవుతున్నారని కోనప్ప అన్నారు.పలువురు రైతులు తనను కలిసి తమ భూములు నిషేధిత జాబితాలో చేరాయని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు.అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించ డం లేదని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు.పూర్తి పట్టాలు కలిగి,ఎన్నో సంవత్సరా లుగా భూములను సాగు చేసుకుంటున్న రైతుల భూములను కూడా 22ఎలో చేర్చడం



అన్యాయమని కోనప్ప తీవ్రంగా ఖండిం చారు.తన స్వంత భూమిని కూడా 55 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటు న్నప్పటికీ 22ఎ నిషేధిత జాబితాలో చేర్చారని ఈ సందర్భంగా కోనేరు కోనప్ప వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మూడేళ్లుగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని ఆయన విమర్శించారు. రైతుబంధు,రైతుబీమా, యూరియా వంటి అంశాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫల మైందని ఆరోపించారు.రైతుల భూములను 22ఎ నిషేధిత జాబితాలో చేర్చి వారిని ఇబ్బందులకు గురిచేయడం వెనుక అక్రమ సంపాదనకు అవకాశం కల్పించడమే లక్ష్యమా? అని కోనప్ప ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పట్టాలు, హక్కులు,సాగు ఆధారాల ను పరిశీలించి అర్హులైన రైతుల భూములను వెంటనే 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించా లని,రైతులకు న్యాయం చేయాలని కోనేరు కోనప్ప డిమాండ్ చేశారు.

# ఆగస్టు 25 నుంచి సామూహిక మొక్కల నాటకం

### నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్






**నల్లగొండ, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనమహోత్సవంలో భాగంగా ఆగస్టు 25 నుంచి సామూహిక మొక్కల నాటే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో ఉన్న మొక్కలను వార్డులు, గ్రామాల వారీగా నాటేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి బతికేలా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. సెప్టెంబర్ చివరి నాటికి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, మొక్కలకు జియో ట్యాగింగ్ చేసి టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జావిద్, ఆఫ్రిన్‌ల వివాహ వేడుకకు మిషన్ భగీరథ ఐఎన్‌టీయూసీ నాయకులు



**వీఎం బంజర్, ఆగస్టు, 24 (తెలంగాణ వాణి)**
వీఎం బంజర్‌లోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో పాత కారవీగూడెం గ్రామానికి చెందిన మిషన్ భగీరథ కార్మికుడు ఎస్.కె. సుభానీ కుమారుడు జావిద్, ఆఫ్రిన్‌ల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా మిషన్ భగీరథ ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అనుబోతు బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు జంగం నరసింహారావు, కార్యదర్శి గొడ్ల నరసింహారావు, కోపూరి నాగేశ్వరరావు, ఉపేందర్, వెంకటేశ్వరరావు, బాలాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# గోల్య తండా ఉపాధి హామీ నిధులపై సమగ్ర విచారణ జరపాలి




**టేకులపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
గోల్య తండా గ్రామపంచాయతీలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లి ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. 2022 నుంచి 2026 వరకు వచ్చిన నిధులు, ఖర్చులు, పనుల వివరాలతో పాటు బ్యాంకు లావాదేవీలు, మస్టర్ రోల్స్, జాబ్‌కార్డులు, బిల్లులు, వౌచర్లు, నర్సరీల రికార్డులు తదితరాలను పరిశీలించాలని కోరారు. నిధులు పక్కదారి పట్టినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బానోత్ జబ్బర్‌లాల్ నాయక్, మూడ్ మురళీమోహన్ నాయక్, భూక్య మంగీలాల్ నాయక్, రమేష్ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వేంసూరు మండలం లింగపాలెం ఎస్సీ కాలనీలో డ్రైనేజీలను పూడ్చి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం వైఎస్సార్ నగర్‌లో ప్రభుత్వ స్థల ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదును మున్సిపల్ కమిషనర్‌కు పంపారు. ఆధార్ సేవలకు అవకాశం కల్పించాలని కోరిన అర్జీపై పరిశీలనకు ఈడీఎంకు సూచించారు.

## ఉచిత వృత్తి విద్యా శిక్షణ

**మందమర్రి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
సింగరేణి మందమర్రి ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువతకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ తెలిపారు. మూడు నెలల టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, రెండు నెలల కంప్యూటర్ డీటీపీ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. భూ నిర్వాసితుల కుటుంబాలు, సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల కుటుంబాలతో పాటు బెల్లంపల్లి, కాసిపేట, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర గ్రామాల మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 31లోపు జీఎం పీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో ఎస్ఎస్సీ మెమో, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఉద్యోగి/మాజీ కార్మికులైతే ఐడీ కార్డు జత చేయాలి. వివరాలకు: 7032878575, 9490940391.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో గ్రామ/వార్డు సభలు నిర్వహించాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్ర మంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీన గ్రామ/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా ఎన్నికల అధికారులు,ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సభల నిర్వహ ణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.కరీంనగర్ నుండి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి చిత్ర మిశ్రా ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొ న్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ/వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి.(ఆబ్సెంట్,షిఫ్ట్,డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు,సూపర్వైజర్ల సమక్షంలో చదివి వినిపిం చాలని తెలిపారు.గ్రామ/వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6,7,8 అందుబాటులో ఉంచుకోవా లని,ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకో వాలని తెలిపారు.అనామో లీస్,మ్యాపింగ్ కానీ ఓటర్ల కు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధు లకు అందించాలని,పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేష న్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించా లని తెలిపారు.అవసరం ఉన్నచోట అదనపు ఎ.ఈ. ఆర్.ఓ.ల సంబంధిత ప్రతిపాదనలు రేపటి లోగా పంపించాలని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి)**
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామి, ఇతర ఉన్నత అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 193 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా నగరపాలికకు 58,గృహ నిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం క్యాంపు కార్యాలయం, సీఎస్ ప్రజావాణి దరఖాస్తు ల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎప్పటికప్పుడు లాగిన్ లో పరిష్కరించిన దరఖాస్తుల ను అప్డేట్ చేయాలన్నారు. మేజర్ ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల ను సంప్రదించి దరఖాస్తుల ను పరిష్కరించాలని పేర్కొన్నారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అరాధన ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు



**నిర్మల్ - భైంసా: ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పాఠ్యాంశాలతో పాటు విద్యార్థులకు ఆచరణాత్మక జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు మంజ్రీ గ్రామ సమీపంలోని అరాధన ఆయుర్వేద వెల్‌నెస్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ విద్యా పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆయుర్వేద వైద్యం,ఔషధ మొక్కలు,ప్రకృతి చికిత్స, యోగా,ఆరోగ్య పరిరక్షణ విధానాలపై నిపుణుల నుంచి ఆసక్తికరమైన విషయాలను తెలుసుకున్నారు. పరిశోధనా కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి,ఆయుర్వేద వైద్యంలో ప్రకృతి వనరుల ప్రాధాన్యతను ప్రత్యక్షంగా అవగాహన చేసుకున్నారు. అంతేకాకుండా యోగా,ప్రకృతి చికిత్సలో శిక్షణ పొందేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారితో విద్యార్థులు ముచ్చటించారు.ఈ సందర్భంగా వారు భారతదేశ గొప్పతనం, భారతీయ సంస్కృతి, యోగా, ప్రకృతి వైద్యం ప్రత్యేకతలను విద్యార్థులతో పంచుకున్నారు. పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఇలాంటి విద్యా పర్యటనలు విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతి,ఆరోగ్యం, భారతీయ వైద్య విధానాలపై ఆసక్తిని పెంచుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత భూముల నుంచి పట్టా భూములను తొలగించాలి

- మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల

**కరీంనగర్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిది)**
రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చ డం సరికాదని మాజీ మంత్రి,కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నా రు.నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.భూ బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భం గా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ, అసైన్డ్,దేవాదాయ,వక్ఫ్ తదితర భూములు అన్యా క్రాంతం కాకుండా కాపాడేం దుకు రిజిస్ట్రేషన్ చట్టం- 1908లోని 22ఏ సెక్షన్ ఉద్దేశించబడిందన్నారు. అయితే ఆ నిబంధనలను ఆధారంగా చేసుకుని ప్రైవేటు పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది మంది భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు.22ఏ(2) నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో భూములను చేర్చే ప్రక్రియను చట్టబద్ధం గా చేపట్టాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం తహసీల్దార్,ఆర్డీవో లేదా జిల్లా కలెక్టర్ స్థాయిలో నే సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చడం సాధ్యం కాదని,ప్రభుత్వ స్థాయిలో నిర్దేశిత ప్రక్రియను పాటించా ల్సి ఉంటుందని అన్నారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో భూ యజమానులకు న్యాయం జరిగేలా సమగ్రంగా పరిశీ లించాలని కోరారు.ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చే విషయం లో చట్టపరమైన ప్రక్రియను పాటించాల్సిన అవసరం ఉందన్నారు .అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత 22ఏ సెక్షన్‌ను రాజకీయ ప్రయోజనాలు,అవినీతికి వేదికగా మార్చి ందని ఆయ న ఆరోపించారు.పట్టాదా రులకు సరైన నోటీసులు ఇవ్వకుండా,నిర్దేశిత ప్రక్రియను పాటించకుండా వేలాది ఎకరాల భూములు, వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని విమర్శించారు. ఊర్లకు ఊర్లే నిషేధిత జాబితాలో కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని రేకుర్తి,కొత్త యాస్వాడ,విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పట్టా భూము లు 22ఏ జాబితాలోకి వెళ్లాయని గంగుల కమలా కర్ తెలిపారు.రేకుర్తి,విద్యా





నగర్,కొత్తపల్లి ప్రాంతాల్లో 22ఏ కారణంగా వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఇటీవల వచ్చిన నివేదికలు కూడా పేర్కొంటున్నాయన్నారు.. గ్రామపంచాయతీ,మున్సిప ల్ అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారు,ఏళ్ల తరబడి భూములను అనుభవిస్తున్న పట్టాదారు లు సైతం ఇప్పుడు వాటిని విక్రయించు కోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.విద్య, వైద్యం,వివాహాలు,కుటుం బ అవసరాల కోసం భూములను విక్రయించు కోవాల్సిన సమయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం తో బాధితులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నార ని పేర్కొన్నారు.భూముల రికార్డుల విషయంలో ప్రభుత్వం,రెవెన్యూ అధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టత తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఒకవైపు అర్హత కలిగిన పట్టా భూము లను 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ,మరోవైపు ప్రభుత్వ ప్రయోజనాల కోసం సేకరిం చిన భూముల రికార్డులు సరిచేయకపోవడం ఏంటని ప్రశ్నించారు .రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ సెక్షన్ దుర్వినియోగంపై నైతిక బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ నియోజ కవర్గంలోని రేకుర్తి,కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో నిషేధిత జాబితా లో చేర్చిన అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే 22ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్క రించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గంగుల కమలాకర్ హెచ్చరించారు. అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి 'చలో సెక్రటే రియట్'కార్యక్రమానికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు.భూ బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ వారి తరఫున పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు,మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, టిఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు టిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ప్రజా ప్రతినిధు లు భూ బాధితులు బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ సిబ్బందికి నేర పరిశోధన, కేసుల దర్యాప్తుపై శిక్షణ

**నిజామాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



అటవీ నేరాల కేసుల దర్యాప్తు, నేర పరిశోధన, కోర్టు విచారణలో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన అంశాలపై అటవీశాఖ సిబ్బందికి సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తును శాస్త్రీయంగా, సాంకేతిక పరిజ్ఞా నాన్ని వినియోగిస్తూ చేపట్టే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసే వరకు ప్రతి దశలో సత్వర చర్యలు తీసు కోవడం, నేరానికి సంబంధించిన పక్కా ఆధారాలను సేకరించడం, సాక్ష్యాలను పకడ్బందీగా భద్రపరచడం వంటి అంశాలను వివరించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023లోని దర్యాప్తు, సాక్షుల విచారణ, శోధనలు, మేజిస్ట్రేట్‌కు కేసుల పంపకం, దర్యాప్తు అనంతరం నివేదిక సమర్పణ తదితర నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. నేరస్థలంలో లభించే భౌతిక, డిజిటల్ ఆధారాలు, ఫొటోలు, వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలను నిబంధనల ప్రకారం సేకరించి వాటి సమగ్రతను కాపాడాలని సూచించారు. అలాగే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి నమూనాలను పంపే సమయంలో సరైన ప్యాకింగ్, లేబులింగ్, సీలింగ్, డాక్యుమెంటేషన్, చైన్ ఆఫ్ కస్టడీ పాటించాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్ కేసులకు సంబంధించి సమన్లు, వారెంట్లను సకాలంలో అమలు చేసి, సాక్షులను విచారణకు హాజరుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా, నేరం కోర్టులో రుజువై నిందితుడికి చట్ట ప్రకారం శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టడమే ప్రతి దర్యాప్తు అధికారికి ప్రధాన లక్ష్యంగా ఉండాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. అటవీశాఖ, పోలీస్ శాఖల మధ్య సమన్వయంతో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తును మరింత పటిష్టంగా, వేగవంతంగా చేపట్టాలని ఆయన అన్నారు. ఈ శిక్షణలో ఎఫ్ఐఆర్ నమోదు, సాక్ష్యాల సేకరణ, ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, చార్జిషీట్ దాఖలు, కోర్టు ప్రక్రియలు, సమన్లు--వారెంట్ల అమలు తదితర అంశాలపై అటవీశాఖ సిబ్బందికి ప్రాయోగిక అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సి.సి.ఆర్.బి ఏసిపి బి. గురు నాయుడు , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , మల్లేశం , ఎస్. ఐ జె. వరప్రసాద్ రెడ్డి , ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ బట్ మరియు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల మహాధర్నాను విజయవంతం చేయాలి

**మంచిర్యాల, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న నస్పూర్ ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న ఉద్యోగుల మహాధర్నాను విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. మహాధర్నా సన్నాహాల్లో భాగంగా సోమవారం ఐడీఓసీ, ఇరిగేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, అటవీశాఖ కార్యాలయాల్లో ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించారు. పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలు, పదోన్నతులు, బదిలీలు తదితర సమస్యలపై చర్చించారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ప్రతి ఉద్యోగి మహాధర్నాకు



హాజరై ఐక్యత చాటాలని శ్రీహరి కోరారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ, టీఎన్జీవో నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చారు.. నెరవేర్చారు

**కేజీబీవీలో ఉచిత ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం**

**నిర్మల్--తానూర్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థినులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పాటిల్ తానూర్ కేజీబీవీలో ఉచిత ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఆయన ప్లాంట్‌ను ప్రారంభించారు. గతేడాది పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థినులు పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరగా, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని మోహన్‌రావు పాటిల్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ప్లాంట్ ఏర్పాటు చేయడంతో విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే ప్రజా ట్రస్ట్ లక్ష్యమని మోహన్‌రావు పాటిల్ తెలిపారు. అత్యవసర సమయాల్లో బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ అలేఖ్య, తానూర్ మండల సర్పంచ్ సునంద పాటిల్, శివాజీ పాటిల్, బామ్ని సర్పంచ్ గణేష్




బొంద్రట్, సర్పంచ్ రవీందర్ పాటిల్, ఎల్వంత్ సర్పంచ్ సురేష్ బోల్సా, ఉప సర్పంచ్ రాందాస్ పాటిల్, భైంసా కౌన్సిలర్ దిలీప్, మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, మండల ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేగుంట కుటుంబానికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ చేయూత




**మందమర్రి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న రేగుంట సాయి--పూజిత దంపతుల కుటుంబానికి సోమవారం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి రాందేవ్ ట్రేడర్స్ నిఖిల్ సహకారంతో సరుకులు అందించినట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ తెలిపారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, జావిద్ పాషా, పృధ్వి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబి వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి



**కరీంనగర్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
మిలాద్ ఉన్ నబి పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మిలాద్ కమిటీ సభ్యులను కోరారు. సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో మర్కజీ మిలాద్ కమిటీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ, మదరసా అన్వార్ ఉల్ ఉలూమ్ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పండుగ సందర్భంగా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. చివరి రోజు నిర్వహించే జులూస్‌కు సాధారణ షరతులతో అనుమతి ఇస్తున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు రాంచందర్‌రావు, సృజన్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వర్గీయ శ్రీనివాసరావుకు ఎంపీ రవిచంద్ర నివాళి



**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
స్వర్గీయ జోగినిపల్లి శ్రీనివాసరావుకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా నివాళులర్పించారు. సోమవారం కొంపల్లిలోని ఆస్పిషియస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన శ్రీనివాసరావు దశదిన కర్మకాండకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, మాజీ ఎంపీ కే.ఆర్. సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి తదితరులు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బావమరిది, శోభమ్మ తమ్ముడైన జోగినిపల్లి శ్రీనివాసరావు ఈ నెల 13న మృతి చెందిన విషయం తెలిసిందే.

## నకిలీ కార్మిక కార్డులను తొలగించాలి



**ఎల్లారెడ్డి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
: బాన్సువాడ సహాయ కార్మిక అధికారి కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు సోమవారం సహాయ కార్మిక అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిజమైన శ్రమజీవులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు కానివారు పొందిన నకిలీ కార్మిక కార్డులను గుర్తించి తొలగించాలని, ఇకపై నకిలీ కార్డులు జారీ కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్న మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మహేష్, మద్ది సాయిబాబు ఎల్లారెడ్డి మండల ఉపాధ్యక్షులు పెద్దగాని సాయిలు మండల నాయకులు. రుద్రారం రవి. సాయిలు. బందరి రమేష్. శ్రీను. నందు సిద్దు పద్మ సాయిలు. సంజీవులు. మహేష్. రవి. తదితరులు పాల్గొన్నారు

## వన మహోత్సవ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి



**మంచిర్యాల, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
వన మహోత్సవం--2026లో జిల్లాలకు కేటాయించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి వారంలోగా 100 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంచిర్యాల జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 27 లక్షల మొక్కలు నాటినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, డీఆర్డీఓ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

### రేపు మాస్ ప్లాంటేషన్ చేపట్టాలి: మంత్రి కొండా సురేఖ




**నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వన మహోత్సవం అమలుపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మాస్ ప్లాంటేషన్‌ను విజయవంతం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి



**నిర్మల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రజావాణిలో అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజావాణిలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలు సమర్పించారు.

## రోడ్డు ఆక్రమణపై ప్రజావాణిలో ఫిర్యాదు




**చౌటుప్పల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యనగర్, మణికంఠ వెంచర్ల మధ్య ఉన్న సీసీ రోడ్డును కొందరు ఆక్రమించారని ఆరోపిస్తూ కాలనీవాసులు, ప్లాట్ల యజమానులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. నకిలీ పత్రాలతో రోడ్డును కబ్జా చేసి, సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మించి రాకపోకలను అడ్డుకున్నారని వారు ఆరోపించారు. దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రహరీని తొలగించి రహదారిని పునరుద్ధరించాలని కోరారు.

## యూరియా, డీఏపీపై అధిక వసూళ్ల ఆరోపణలు

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా, డీఏపీని కొందరు వ్యాపారులు నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తెలిపారు. యూరియా బస్తాను రూ.320--350, డీఏపీని రూ.1,850 వరకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఎరువులు, పురుగుమందుల ధరలను దుకాణాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని, అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. రైతులకు నిర్ణీత ధరలకే ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు

## హామీలకంటే అదనంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

**రూ.87.53 కోట్లతో కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభం**



**వనపర్తి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు అదనంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లాలో రూ.87.53 కోట్లతో నిర్మించిన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాలు కలిపి మొత్తం 4,235 ఎకరాలకు సాగునీరు అందనుంది. గిరిజనుల ఆకాంక్ష మేరకు ప్రాజెక్టుకు వారి ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని కోమటిరెడ్డి తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్



నియంత్రణపై అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ప్రాజెక్ట్ పూర్తితో రెండు జిల్లాల రైతులకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ గతంలో మధ్యలో నిలిచిపోయిన ప్రాజెక్ట్ పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌తో కలిసి సర్జ్ పూల్ వద్ద నీటి ప్రవాహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు

## భానుపురి పాడి రైతుల సహకార సంఘం కార్యాలయం ప్రారంభం



**చిలుకూరు, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
గ్రామీణ ప్రాంత పాడి రైతుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నాబార్డ్ సహకారంతో చిలుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భానుపురి డైరీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) కార్యాలయాన్ని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం రవీంద్ర నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులందరూ ఎఫ్‌పీఓలో సభ్యులుగా చేరి నాబార్డ్ అందించే రాయితీలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలను వివిధ ఉత్పత్తులుగా తయారు చేసి విక్రయించడం ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. నాబార్డ్ డీడీఎం రవీంద్ర నాయక్ మాట్లాడుతూ గ్రామీణ రైతుల ఆర్థికాభివృద్ధి కసం ఎఫ్‌పీఓను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, ఎఫ్‌పీఓ చైర్మన్ కొడారు రాము, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు లారీలతో ఛిద్రమైన కొయ్యూరు--తాడిచర్ల రహదారి

- **వందలాది లారీల రాకపోకలు..**
- **గుంతలమయమైన రహదారి.. వర్షం పడితే ప్రయాణం నరకప్రాయం**



**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మల్హర్‌రావు మండలంలోని కొయ్యూరు--తాడిచర్ల రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాడిచర్ల ఓసీ--1 నుంచి భూపాలపల్లి జెన్‌కోకు ప్రతిరోజూ వందలాది బొగ్గు లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి గుంతలమయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి, బురదగా మారడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గుంతల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, భారీ లారీలు ఎదురుగా వచ్చినప్పుడు గుంతలను తప్పించుకునే క్రమంలో మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై కొయ్యూరు, తాడిచర్లతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులు, రైతులు, కూలీలు, ఉద్యోగులు నిత్యం ప్రయాణిస్తుంటారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లేవారికి సైతం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భారీ బొగ్గు రవాణాకు అనుగుణంగా రహదారిని పటిష్టంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు. కేవలం తాత్కాలికంగా గుంతల్లో కంకర పోయడం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, రహదారి శాఖ, గనుల అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## పదోన్నతిపై వెళ్తున్న సివిల్ జడ్జికి వీడ్కోలు



**చౌటుప్పల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించిన రాచర్ల శాలినికి సబ్ జడ్జిగా పదోన్నతి లభించి హైదరాబాద్‌కు బదిలీ కావడంతో సోమవారం చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రాచర్ల శాలిని మాట్లాడుతూ చౌటుప్పల్ కోర్టులో 14 రోజుల పాటు విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్లడం సంతోషంగా ఉన్నప్పటికీ, ఇక్కడి న్యాయవాదులు, సిబ్బందిని విడిచి వెళ్లడం బాధగా ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేశ్ మాట్లాడుతూ స్వల్పకాలంలోనే సమర్థవంతంగా విధులు నిర్వహించి పలువురి ప్రశంసలు పొందారని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పిట్టల భిక్షమయ్య, న్యాయవాదులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ హైవే బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి





**చౌటుప్పల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: చౌటుప్పల్ పట్టణ పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. విజయవాడ--హైదరాబాద్ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య తీవ్రంగా ఉంటోందన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, రాత్రివేళ లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. బ్రిడ్జి, రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ ఉండాలని డిమాండ్ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చౌటుప్పల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని యాదయ్యగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బి ఆర్ ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, మునుగోడు బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు నల్వరాజు రమేష్, మండల నాయకులు బోయ శ్రీరాములు, ధర్మోజిగూడెం గ్రామ అధ్యక్షులు బత్తుల సింహాద్రి, నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం, గుజ్జ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తయ్య, నాయకులు పొట్ట జంగయ్య, సుర్వి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో నేడు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

**మందమర్రి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**



మందమర్రి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు మంగళవారం ఉదయం 10 గంటలకు సంద్రో న్‌పల్లి పరిధిలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో లక్కీడ్రా నిర్వహించ నున్నట్లు తహసీల్దార్ పనకంటి సతీష్‌కుమార్ శర్మ తెలిపారు. జిల్లా అధికారుల సమక్షంలో అర్హుల జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి బ్లాక్, ఫ్లోర్ కేటాయిస్తామని పేర్కొన్నారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని, లబ్ధిదారులను మాత్రమే హాల్‌లోకి అనుమతిస్తామని తెలిపారు. వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఎంపిక అనంతరం అనర్హతపై ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ప్రజావాణికి 103 ఫిర్యాదులు



**నిజామాబాద్, ఆగస్టు 24 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ నిరసన



**ఎల్లారెడ్డి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా ఎల్లారెడ్డి బీజేపీ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు అగల్ దివిటీ రాజేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని దేవేందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాలలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్రి బాలకిషన్, పెద్దేండ్ల నర్సింలు, ఎం. సాయిలు, బంజపల్లి శివ, అగల్ దివిటీ గజనన్, జంగం శివ పాల్గొన్నారు.

## .రూపారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ఇటీవల మృతి చెందిన కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రూపారెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం గుర్రంగూడలోని వారి నివాసంలో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు ప్రతి పాఠశాలలో కౌన్సిలర్‌ను నియమించాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రూపారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోజు శంకరాచారి, గండు నాగేంద్రబాబు, రామావత్ రమేష్, చరగొని శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట వైఎస్సార్ నగర్ గుడిసెలను పరిశీలించిన దాస్యం వినయ్ భాస్కర్

### పేదల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది: వినయ్ భాస్కర్





**కాజీపేట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో):**
కాజీపేట వైఎస్సార్ నగర్‌లోని గుడిసెవాసుల సమస్యలను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ సోమవారం పరిశీలించారు. గుడిసెవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 నుంచి పేదలు ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని తెలిపారు. కొందరు షాపూర్ ఇరానీ కుటుంబ సభ్యులమంటూ వచ్చి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నకిలీ పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇక్కడ నివసిస్తున్న పేదలకు ఇంటి నంబర్లు, ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయని తెలిపారు. అక్రమంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌కు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని కోరారు. అనంతరం రైల్వే రిటైర్డ్ ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## గాంధీనగర్‌లో దారుణం

### డబ్బుల కోసం కన్నతల్లినే కడతేర్చిన కొడుకు

**వనపర్తి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డబ్బుల కోసం కన్నతల్లితో గొడవపడి మద్యం మత్తులో ఆమెను హత్య చేసిన ఘటన వనపర్తి పట్టణంలోని గాంధీనగర్ 20వ వార్డులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికంగా నివసించే రజియా బేగం (60) తన కుమారుడు ఆసిఫ్‌తో కలిసి ఉంటోంది. మద్యానికి బానిసైన ఆసిఫ్ తరచూ డబ్బుల కోసం తల్లితో గొడవపడేవాడు. ఆదివారం మద్యం మత్తులో ఆమె తలపై బలమైన ఆయుధంతో దాడి చేయడంతో రజియా బేగం అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



## బ్రహ్మకుమారి సేవా కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**వనపర్తి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాజయోగిని ప్రకాశ్‌మణి పుణ్య తిథిని పురస్కరించుకుని వనపర్తి బ్రహ్మకుమారి సేవా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు బీకే శోభ, ఎన్‌సీడీ ప్రాజెక్టు అధికారి డాక్టర్ మారుతి నందన్, వైద్యాధికారులు హరీష్, అనిత మాట్లాడుతూ రక్తదానం ప్రాణాపాయంలో ఉన్నవారికి ప్రాణదానం వంటిదని అన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బ్రహ్మకుమారీస్ సేవకులు పాల్గొని 17 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిర సహాయకులు గంధం భక్తరాజ్, రెడ్ క్రాస్ నుండి రాజేందర్, డిఎంహెచ్వో కార్యాలయ అధికారి చంద్రయ్య, రాజు, సౌమ్య, నాగశైలపతి, లక్ష్మీనారాయణ, ఎలిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ వాహిని పట్టణ కమిటీ ఎన్నిక



**వనపర్తి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి పట్టణంలోని కేశవ స్మారక భవన్‌లో హిందూ వాహిని కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి హిందూ వాహిని విభాగ్ కన్వీనర్ అభిలాష్ హౌదేకార్ హాజరై మాట్లాడారు. హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల భద్రత, యువతలో సామాజిక బాధ్యత పెంపొందించడం, సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడంపై నూతన కమిటీ దృష్టి సారించాలని సూచించారు. సేవా కార్యక్రమాలు, యువత చైతన్యం, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నూతన పట్టణ కన్వీనర్‌గా జశ్వంత్, కో-కన్వీనర్లుగా నీలేష్, సంతోష్, చరణ్, యాదగిరిలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అర్జున్, కార్తీక్, దేవా, రాజదీప్, నిఖిలేష్, యువరాజ్, మణిదీప్, నవీన్, రాఘవేంద్ర, రాహుల్, వంశీ, ధీరజ్, జయప్రకాష్, హర్షదీప్, సాయినాథ్ తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలువురు హిందూ వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**డిండి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్-765పై సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్న యూనికార్న్ ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఎంజీ ఆస్టర్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రకళ, పాత్లావత్ నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిండి ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపారు.



## రూ.7.55 కోట్ల సివిల్ సప్లైస్ కుంభకోణం.. ఇద్దరి అరెస్ట్



**వేములవాడ, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన భారీ సివిల్ సప్లైస్ ధాన్యం దుర్వినియోగం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ ఎ.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనాయిపల్లి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి రైస్‌మిల్ నిర్వాహకులు కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకున్న 8,447.138 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన రూ.7.55 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సప్లైస్ డీఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో ఏ1 చేపూరి అంజయ్య, ఏ5 లోపెల్లి వెంకటేశ్వర్‌రావులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు.

## ఒగ్గు కథ కళాకారులకు ఘన సన్మానం

**కొమురవెల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
హైదరాబాద్ యూనివర్సిటీలో "ఒగ్గు కథ యూనివర్స్ 2025 ఆనర్స్" రాష్ట్ర స్థాయి పురస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎంపికైన 25 మంది ప్రముఖ ఒగ్గు కథ కళాకారులను వారి కళా సేవలు, అంకితభావానికి గుర్తింపుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఒగ్గు కథ తెలంగాణ సంస్కృతి, చరిత్ర, ఆధ్యాత్మికతను తరతరాలకు చేరవేస్తున్న విశిష్ట జానపద కళారూపమని పేర్కొన్నారు. కళారూప పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో "గాడ్స్ ఇన్ ది వాయిస్" ఒగ్గు



కథపై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. పలువురు సినీ, సాంస్కృతిక, విద్యా రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

## మడిపల్లి, పెద్దంపల్లిలో వైద్య శిబిరాలు

**జమ్మికుంట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి)**
: జమ్మికుంట మండలంలోని మడిపల్లి, పెద్దంపల్లి గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మడిపల్లిలో డాక్టర్ సంధ్య, పెద్దంపల్లిలో ఎంఎల్‌హెచ్‌పీ దిలీప్ ఆధ్వర్యంలో శిబిరాలు జరిగాయి. ప్రజలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా నివారణతో పాటు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, డ్రై డే పాటింపు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎగిత పద్మకుమార్, పసుల తిరుమల వెంకటేష్, హెల్త్ సూపర్‌వైజర్ కొండపాక



సదానందం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



**వేములవాడ, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతుల్లో షాదుల్లా, ఆయన భార్య హాసీనా, మరో హాసీనా, పదో తరగతి విద్యార్థిని ఉన్నారు. సోమవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే పరామర్శించి, మృతదేహాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని విప్ తెలిపారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి, అతివేగానికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.






## మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

**జమ్మికుంట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
జమ్మికుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, హుజురాబాద్ ఆధ్వర్యంలో సోమవారం చీరలు పంపిణీ చేశారు. పాత మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ జి. మల్లికార్జున స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్‌ను అభినందించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.




## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో నిరసన దీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. బకాయిలు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రూ.12 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఎండపల్లి పరిధిలో ఎఫ్‌పీఓ ఏర్పాటు చేయాలి

**ఎండపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ఎండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేయాలని కోరుతూ కొత్తపేట సర్పంచ్ జి.రెడ్డి మహేందర్‌రెడ్డి సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీఓ ఏర్పాటుతో రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరలకు లభించడంతో పాటు పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పరికరాలు, ప్రభుత్వ రుణాలు, సబ్సిడీలు పొందేందుకు కూడా ఎఫ్‌పీఓలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎఫ్‌పీఓ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

## ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

### ఓటర్ల ముసాయిదా జాబితాలపై అప్రమత్తంగా ఉండాలి: పొలాస నరేందర్

**వేములవాడ, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఈ నెల 27న రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలను పరిశీలించుకోవాలని ఉత్తర తెలంగాణ బీసీ సాధికారిత సంఘం ఇన్‌చార్జి పొలాస నరేందర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫామ్-6, అభ్యంతరాలు, బోగస్ ఓట్ల తొలగింపునకు ఫామ్-7, వివరాల సవరణలకు ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా ప్రజలు గ్రామ, వార్డు సభల్లో చురుగ్గా పాల్గొనాలని నరేందర్ పిలుపునిచ్చారు.



## రాంసాగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కొమురవెల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులతో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీ మరింత సులభతరం, పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీపీఓ రాధిక, పంచాయతీ కార్యదర్శి శ్రీలీల, వార్డు సభ్యులు, రేషన్ డీలర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

**భువనగిరి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి విలేకరి):**
జిల్లాలో బాలలపై దాడులు, ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అఖిల భారత బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల బస్సుల్లో డ్రైవర్‌తో పాటు అటెండర్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, పాఠశాల ఆవరణల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించి శిథిలావస్థలోని భవనాలను తొలగించాలని కోరారు. బాలికల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో కౌన్సిలర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు అప్పటి వరకు వాలంటీర్లను నియమించాలని కోరారు.



## ప్రజావాణికి కరువైన ఫిర్యాదులు



**నాగిరెడ్డిపేట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గంగాధర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బిక్షపతి, ఎంపీవో ప్రభాకర్‌చారి, వెటర్నరీ వైద్యుడు రవికుమార్, ఐకేపీ ఏపీఎం దత్తు, మండల అధికారులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**రాయికల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పారదర్శక పాలన, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో బింగి చిరంజీవి అధికారులను ఆదేశించారు. సోమవారం రామోజీపేట్ గ్రామపంచాయతీని సందర్శించిన ఆయన అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. 2026--27 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (ఙూణూ), 16వ ఆర్థిక సంఘం నిధుల ప్రణాళికలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటి నంబర్‌కు కుటుంబ మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేయాలని, పారిశుద్ధ్యం, తాగునీటి క్లోరినేషన్, నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుష్మా,సర్పంచ్ మోహన్,నరేష్ పంచాయతీ కార్యదర్శి మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## వైద్య సేవలపై సమీక్ష



**నాగిరెడ్డిపేట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి)**
: నాగిరెడ్డిపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి పద్మజ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో అందుతున్న వైద్య సేవలు, జాతీయ టిబీ నిర్మూలన కార్యక్రమంపై సిబ్బందితో సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం కేజీబీవీ విద్యార్థులకు హెచ్‌పీవీ టీకాలు వేయించి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుజన్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మేదర కులస్తులకు ఆసరా పింఛన్ వర్తింపజేయాలి




**రాయికల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
తరతరాలుగా వెదురు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేదర (మహేంద్ర) కులస్తులకు ఆసరా పింఛన్ వర్తింపజేసి ప్రభుత్వం ఆదుకోవాలని రాయికల్ మండల మహేంద్ర సంఘం అధ్యక్షుడు సిలివేరి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం రాయికల్ మండల ప్రజావాణిలో ఎంపీడీవో బింగి చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ప్లాస్టిక్, స్టీల్, ఫైబర్ వస్తువుల రాకతో వెదురు చేతివృత్తి కుదేలై ఆదాయం తగ్గిపోయిందని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 50 ఏళ్లు దాటిన మేదర కులస్తులకు ఆసరా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శనిగరపు రాజనర్సయ్య, ప్రమోద్, రంజిత్, చింత రాజేశం, నర్సయ్య, సిలివేరి ప్రశాంత్, శ్రీనివాస్, పిల్లి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**కరీంనగర్ టౌన్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ వద్ద 48 గంటల దీక్ష సోమవారం ప్రారంభమైంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గిట్ల ముకుందరెడ్డి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు ఎనిమిదేళ్లుగా వేతనాలు పెరగలేదని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల బీమా కల్పించాలని, రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ముకుందరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉప్పునూటి శ్రీనివాస్, ఎడ్ల రమేష్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్‌తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఇబ్రహీంపట్నంమండల ప్రజలు వినియోగించుకోవాలి.

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 24 (తెలంగాణ వాణి విలేఖరి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయం లో నిర్వహించబడింది. ప్రజల నుండి 5 వరకు వినతులులను స్వీకరించారు.రెవెన్యూ డిపార్ట్మెంట్ కి 4, హౌసింగ్ డిపార్ట్మెంట్ 1 చొప్పున వచ్చాయి. సంబంధిత శాఖలకు వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సిహెచ్ గణేష్ అదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్ధర్ వరప్రసాద్, ఎంపీఓ రామకృష్ణ రాజు,ఎంఈఓ మధు, వ్యవసాయ అధికారి రాజ్ కుమార్,మండల వైద్యాధికారి హరీష్ కుమార్,మండల స్థాయిలో గల అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వల్బాపూర్ కాంగ్రెస్‌లో వర్గపోరు భగ్గుమంటోంది!

- **మాజీ ఎంపీటీసీ దేవేందర్‌పై సర్పంచ్ భర్త కుమార్ ఆరోపణలు..**
- **పోలీసులకు దేవేందర్ ఫిర్యాదు**





**వీణవంక, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీణవంక మండలం వల్బాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మాజీ ఎంపీటీసీ జీడి దేవేందర్ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని సర్పంచ్ భర్త అందె కుమార్ ఆరోపించగా, తనపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది.గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని కుమార్ తెలిపారు. అయితే దేవేందర్ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసి, ప్రత్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారని ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కించపరిచేలా వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో దేవేందర్ పాల్గొనడంపై కూడా కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

**దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు**
మరోవైపు తనపై తప్పుడు, అసత్య ఆరోపణలతో వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ జీడి దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రువర్గాలు పరస్పరం ఆరోపణలు, ఫిర్యాదులు చేసుకోవడంతో వల్బాపూర్ కాంగ్రెస్‌లో విభేదాలు బహిరంగంగా మారాయి. ఈ వ్యవహారంపై పార్టీ పెద్దలు ఎలా స్పందిస్తారన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## సన్నరకం ధాన్యానికి బోనస్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

**డిండి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ పొందాలంటే ప్రభుత్వం అనుమతించిన ఏడు రకాల వరి విత్తనాలను సాగు చేస్తున్న రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రెహానా సూచించారు. తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048), సాంబమసూరి (బీపీటీ-5204), కేఎన్ఎం-1638, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, డబ్ల్యూజీ-44, కేఎన్ఎం-7715 రకాలకు బోనస్ వర్తిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 10లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు అక్కడే నమోదు చేసుకోవాలని, సొంత విత్తనాలతో సాగు చేసిన వారు రైతు ధ్రువీకరణ పత్రంతో ఏఈఓను సంప్రదించాలని తెలిపారు.



# దీపక్‌రెడ్డిని అభినందించిన డిప్యూటీ కలెక్టర్

**నారాయణఖేడ్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బీడుగా ఉన్న రాతి నేలను సాగుభూమిగా మార్చేందుకు రాళ్లు ఏరే యంత్రాన్ని రూపొందించిన బోరంచ గ్రామానికి చెందిన దీపక్‌రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్ అభినందించారు. సోమవారం మనూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ఉపయోగకరమైన యంత్రాన్ని రూపొందించడం అభినందనీయమని డిప్యూటీ కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్, ఆర్ఐ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కోరపల్లిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**జమ్మికుంట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 40--45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి గత వారం రోజులుగా గ్రామంలో తిరుగుతూ ప్లాస్టిక్ సామగ్రి సేకరిస్తూ జీవిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న పాడుబడిన హోటల్‌లో ఆగస్టు 23న మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఎడమ చేతిపై “ఏయూ” అక్షరాలతో టాటూ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు.



## కంది పంటలో అంతర పంటల సాగుపై క్షేత్ర ప్రదర్శన




**పెద్దపల్లి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం మండలం ఇస్సంపేట గ్రామంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో కంది పంటలో అంతర పంటల సాగుపై సోమవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతు బరుపాటి సత్తయ్య సాగు చేస్తున్న కంది పంటలో అంతర పంటగా బొబ్బెర సాగును అధికారులు పరిశీలించారు. అంతర పంటలతో అదనపు ఆదాయం పొందడంతో పాటు భూసారం పరిరక్షించుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దారవేణి సాయి చేతుల మీదుగా రైతుకు ఎరువులు, పురుగు మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే. సతీష్, రైతులు పాల్గొన్నారు.

## పీఎన్ ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం



**పటాన్‌చెరు, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
రామచంద్రాపురం శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పీఎన్ ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కురుమ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.



## జమ్మికుంటలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పట్టణంలోని కేశవపురం కస్తూరిబా పాఠశాల సమీపంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) కౌన్సిలర్లతో కలిసి సోమవారం పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించాలని ఆయన అధికారులను కోరారు. సుమారు 240 ఇళ్ల నిర్మాణం ఉండగా, ప్రస్తుతం 24 ఇళ్లు మాత్రమే నివాసయోగ్యంగా ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను అంచనా వేసి పనులు పూర్తి చేయాలని, అనంతరం పారదర్శకంగా లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మధుమేహ కంటి వ్యాధుల గుర్తింపుపై ఏఐ పరిశోధనకు పీహెచ్‌డీ

**పటాన్‌చెరు, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**



హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో పరిశోధక విద్యార్థిని జి. కార్తీక మధుమేహ సంబంధిత కంటి వ్యాధుల గుర్తింపుపై ఏఐ పరిశోధన చేసి పీహెచ్‌డీకి అర్హత సాధించారు. ‘డయాబెటిక్ రెటినోపతిని స్వయంచాలకంగా గుర్తించడం, వర్గీకరించడం’పై డీప్ లెర్నింగ్, విజన్ ట్రాన్స్‌ఫార్మర్స్, జెనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్‌వర్క్‌ల ఆధారంగా ఆమె పరిశోధన చేశారు. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ముందస్తు కంటి వ్యాధుల నిర్ధారణకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పరిశోధన మార్గదర్శకుడు డాక్టర్ ఎస్. విజయకుమార్ తెలిపారు. కార్తీకను గీతం అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి షఫీకి తల్లాడ జర్నలిస్టుల సన్మానం



**తల్లాడ, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
ఉమ్మడి వరంగల్--ఖమ్మం--నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ షఫీని తల్లాడ జర్నలిస్టులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తల్లాడకు వచ్చిన షఫీకి పాత్రికేయులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎండీ బహుదూర్, గుడిపల్లి నారాయణ, షేక్ మేహరాజ్, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణిలో 9 దరఖాస్తులు

**కోరుట్ల రూరల్, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 9 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో వోదెల రామకృష్ణ తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు 3, మున్సిపాలిటీకి 3, పంచాయతీ, విద్య, విద్యుత్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

## నకిలీ ఆర్ఓఆర్ సర్టిఫికెట్లపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి

**జమ్మికుంట, ఆగస్టు 24 (తెలంగాణ వాణి):**



కోరపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో నకిలీ ఆర్ఓఆర్ సర్టిఫికెట్లు సృష్టించి, రెవెన్యూ రికార్డుల్లో ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరపల్లికి చెందిన బోయిని లావణ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోరపల్లి సర్వే నంబర్ 553/ఏలోని 4-32 గుంటల భూమికి సంబంధించి నకిలీ ఆర్ఓఆర్ పత్రాలు సృష్టించినట్లు ఆమె ఆరోపించారు. ఆర్‌టీఐ ద్వారా పొందిన సమాచారంలో పలు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. పహాణీ, 1-బి రికార్డుల్లోనూ మార్పులు, చేర్పులు జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపెజమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెం.299/2026 నమోదు చేసినట్లు తెలిపారు. నకిలీ పత్రాలను రద్దు చేసి, రికార్డులను సరిచేయడంతో పాటు బాధ్యులపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## ఎమ్మెల్యే సంజీవరెడ్డికి జర్నలిస్టుల శుభాకాంక్షలు




**నారాయణఖేడ్, ఆగస్టు 23 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: నారాయణఖేడ్ పట్టణంలోని బాలాజీ అనురాధ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, సతీష్ తివారి, నారాయణఖేడ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖైసర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కె. శ్రీధర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## విరిగిన విద్యుత్ స్తంభంతో పాదచారులకు ఇబ్బందులు

**జగిత్యాల, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



: జగిత్యాల పట్టణంలోని గోవిందపల్లె వంతెన సమీపంలో బీరువాల తయారీ కేంద్రం ఎదుట విరిగిన పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ఓ లారీ ఢీకొనడంతో స్తంభం విరిగింది. విద్యుత్ శాఖ అధికారులు కొత్త స్తంభం ఏర్పాటు చేసినప్పటికీ, పాత విరిగిన స్తంభాన్ని తొలగించలేదు. ఇనుప సలాకాలు బయటకు కనిపిస్తుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

## పత్తిలో అధిక యూరియా వద్దు.. సమగ్ర పోషకాలే ముద్దు



**కంగ్టి, ఆగస్టు 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పత్తి పంటలో రైతులు అధికంగా యూరియా వాడకుండా, పంట అవసరాలకు అనుగుణంగా సమగ్ర పోషకాలను అందించాలని ఏఈఓ సంతోష్ సూచించారు. కంగ్టి మండలం బీమ్ర గ్రామంలో సోమవారం పత్తిలో సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక యూరియా వాడకంతో కాండం బలహీనపడటంతో పాటు పురుగులు, తెగుళ్లు పెరిగే అవకాశం ఉందన్నారు. మట్టి పరీక్ష ఆధారంగా నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు అవసరమైన సూక్ష్మ పోషకాలను సమతుల్యంగా వినియోగిస్తే అధిక దిగుబడి, లాభాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# 'లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం'..



**గంభీర్ కీలక వ్యాఖ్యలు**

**టెస్టుల్లో భారత్ ఇబ్బందుల్లో లేదన్న గంభీర్**

**ర్యాంకింగ్స్ కంటే ట్రోఫీలు గెలవడమే లక్ష్యమని స్పష్టీకరణ**

**శ్రీలంకపై భారత్ 1-0తో సిరీస్‌లో ఆధిక్యం**

**గిల్, పడిక్కల్, సుతార్‌పై గంభీర్ విశ్వాసం**

**20 వికెట్లు తీసే బౌలింగ్ కూర్పే కీలకమని వెల్లడి**

**న్యూఢిల్లీ:** భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు.

శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ అన్నాడు.

"మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే" అని గంభీర్ స్పష్టం చేశాడు.

కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తం చేశాడు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నాడు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించాడు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించాడు.

మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపాడు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుంది.

# మళ్లీ వివాదంలో స్మిత్..

**ప్రత్యర్థిని కవ్వించడంతో అంపైర్ల హెచ్చరిక**

**బంగ్లాదేశ్‌తో టెస్టులో స్టీవ్ స్మిత్ వివాదాస్పద ప్రవర్తన**

**డీఆర్ఎస్ తీసుకోవాలంటూ ప్రత్యర్థి జట్టును రెచ్చగొట్టిన స్మిత్**

**మైదానంలో జోక్యంపై అంపైర్ల నుంచి అధికారిక హెచ్చరిక**

**సీనియర్ ఆటగాడైనా స్మిత్ తీరు మారలేదంటూ విమర్శలు**



**సిడ్నీ:** ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ మైదానంలో తన ప్రవర్తనతో మరోసారి వార్తల్లో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో డీఆర్ఎస్ రివ్యూ విషయంలో ప్రత్యర్థి జట్టును రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో ఫీల్డ్ అంపైర్లు అతడిని హెచ్చరించారు.

ఈ మ్యాచ్‌లో తస్కిన్ అహ్మద్ వేసిన బంతి స్మిత్ ప్యాడ్లను తాకడంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేశారు. అయితే ఫీల్డ్ అంపైర్ దానిని నాటౌట్‌గా ప్రకటించడంతో, రివ్యూ తీసుకోవాలా వద్దా అని కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో బౌలర్‌తో చర్చించాడు. బంతి వికెట్ల పైనుంచి వెళ్లే అవకాశం ఉందని తస్కిన్ భావించడంతో వారు రివ్యూకు వెళ్లలేదు. వీరిద్దరి మధ్య జరుగుతున్న సంభాషణను గమనించిన స్మిత్, రివ్యూ తీసుకోవాలంటూ బంగ్లా ఆటగాళ్లను ఉద్దేశించి వ్యంగ్యంగా సంజ్ఞలు చేశాడు.

స్మిత్ తీరును గమనించిన ఫీల్డ్ అంపైర్లు వెంటనే అతడిని పిలిచి మందలించారు. ప్రత్యర్థి జట్టు నిర్ణయాల్లో జోక్యం చేసుకోవడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, స్మిత్ వంటి సీనియర్ ఆటగాడికి ఇలాంటి ప్రవర్తన తగదంటూ నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

## శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు

# కుల్దీప్‌కు గంభీర్ కీలక సూచన!

**వికెట్ల కోసం తొందరపడొద్దని కుల్దీప్‌కు గంభీర్ సూచన**

**మంచి స్పెల్‌పై దృష్టి పెట్టాలని సూచించిన గంభీర్**

**20 వికెట్లు తీయగల బౌలింగ్ దళమే లక్ష్యమని వివరణ**

**పరిస్థితులకు తగ్గట్టే తుది జట్టును ఎంచుకుంటామని స్పష్టీకరణ**

**కుల్దీప్‌ను అత్యంత ప్రమాదకర బౌలర్‌గా అభివర్ణన**



**న్యూఢిల్లీ:** వికెట్లు తీయాలనే ఆత్రుతతో బౌలింగ్ చేయకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని భారత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సూచించాడు. శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు. గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు.

అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు. కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు. కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు.




# బిజినెస్ Business

## ఎల్‌పీజీ పైప్‌లైన్‌కు

# గ్రీన్‌సిగ్నల్

### తెలంగాణకు అనుసంధానం



**న్యూఢిల్లీ:** దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను కేంద్రం బలోపేతం చేస్తోంది. తాజాగా కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.7 వేల కోట్లతో దాదాపు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్‌ను విస్తరించేందుకు ప్రణాళిక వేస్తోంది. ఇందుకు పెట్రోలియం, నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రానికి అనుసంధానించనుంది. గేల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ పైప్‌లైన్ నిర్మాణ బాధ్యతలను చేపట్టనుంది.

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల మీదుగా ఈ ప్రాజెక్టును కేంద్రం నిర్మించనుంది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ (556 కిమీ), ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ (611 కిమీ), మహారాష్ట్రలోని షిక్రాపూర్ నుంచి గోవా, కర్ణాటకలోని హుబ్లీ (633 కిమీ) వరకు ఎల్‌పీజీ పైప్‌లైన్‌లను విస్తరించనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే భారతదేశంలోని ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు చేరుతుంది.

# డోర్లలో పొంచి ఉన్న ముప్పు..

**టెస్లా సహా 40 లక్షల ఎలక్ట్రిక్ కార్లు వెనక్కి!**

**డోర్ హ్యాండిల్స్‌లో భద్రతా లోపాలే ప్రధాన కారణం**

**29.8 లక్షల వాహనాలను వెనక్కి రప్పిస్తున్న టెస్లా**

**3.9 లక్షలకు పైగా కార్లను రీకాల్ చేసిన షియోమీ**

**లీప్‌మోటార్ 3.7 లక్షలకు పైగా వాహనాలు వెనక్కి!**



**న్యూఢిల్లీ:** భద్రతా లోపాల కారణంగా టెస్లా సహా పలు చైనా కార్ల తయారీ సంస్థలు భారీ సంఖ్యలో వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. ప్రధానంగా కార్ల డోర్ హ్యాండిల్స్‌కు సంబంధించిన సమస్యలే ఇందుకు కారణం. మొత్తంగా 40 లక్షలకు పైగా వాహనాలపై రీకాల్ ప్రభావం పడుతోంది. చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ ప్రకారం.. టెస్లా చైనాలో తయారు చేసినవి, దిగుమతి చేసుకున్నవి కలిపి సుమారు 29.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను రీకాల్ చేస్తోంది. ఇందులో మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్ ఎస్ ఉన్నాయి.

తీవ్రమైన ప్రమాదం జరిగి విద్యుత్ వ్యవస్థ పనిచేయకపోతే డోర్ హ్యాండిల్స్ సరిగా స్పందించకపోవచ్చని చైనా నియంత్రణ సంస్థ తెలిపింది. దీంతో కారులో ఉన్నవారు త్వరగా బయటకు రావడం కష్టమవుతుందని పేర్కొంది. బయట ఉన్న రక్షణ సిబ్బంది కారులోకి చేరడానికీ ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉందని వివరించింది. ఈ ఏడాది చైనాలో ఇదే అతిపెద్ద వాహనాల రీకాల్‌గా అక్కడి మీడియా పేర్కొంది. డోర్ హ్యాండిల్స్‌పై చైనా ఇటీవలే దృష్టి పెంచింది. వచ్చే ఏడాది నుంచి కొత్త వాహనాల్లో ఇలాంటి హ్యాండిల్స్‌ను నిషేధించనున్నట్లు ఫిబ్రవరిలో ప్రకటించింది. టెస్లాతో పాటు షియోమీ 3.9 లక్షలకు పైగా వాహనాలను వెనక్కి పిలుస్తోంది. లీప్‌మోటార్ 3.7 లక్షలకు పైగా కార్లను రీకాల్ చేస్తోంది. గీలీ, ఎక్స్‌పెంగ్ సహా మరికొన్ని చైనా సంస్థలు కూడా వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి.

రీకాల్ అనేది ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ ఎదుగుదలలో సహజమైన దశ అని చైనా ప్యాసింజర్ కార్ అసోసియేషన్ అధిపతి కుయ్ డోంగ్‌షు పేర్కొన్నారు. డిజైన్ కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. టెస్లా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా సమస్యను తగ్గించనుంది.

# తగ్గిన ఇళ్ల అమ్మకాలు



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ భయాలు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, ఐటీ రంగంలో ఏఐ తెస్తున్న మార్పులతో ఉద్యోగాలపై నెలకొన్న భయాందోళనలు భారత రియల్ ఎస్టేట్ రంగాన్ని కూడా తాకాయి. ప్రముఖ హౌసింగ్ బ్రోకరేజ్ సంస్థ 'ప్రాప్‌టైగర్' విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2026, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 6 శాతం తగ్గి 91,729 యూనిట్లకు పడిపోయాయి. ఈ క్షీణత ప్రధానంగా ఆరు పెద్ద నగరాల్లో స్పష్టంగా కనిపించింది. ముంబై (7 శాతం), ఢిల్లీ-ఎన్‌సీఆర్ (7 శాతం), బెంగళూరు (9 శాతం), అహ్మదాబాద్ (20 శాతం) నగరాల్లో అమ్మకాలు క్షీణించగా, పూణేలో అత్యధికంగా 21 శాతం మేర ఇళ్ల విక్రయాలు పడిపోయాయి. అయితే దక్షిణాది నగరాలైన చెన్నైలో 36 శాతం వృద్ధితో 7,183 యూనిట్లు, హైదరాబాద్‌లో 14.6 శాతం వృద్ధితో 13,196 యూనిట్లు అమ్ముడై డిమాండ్‌ను కొనసాగించడం విశేషం. అదే సమయంలో ఎనిమిది నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా 6 శాతం పెరిగి 89,161 యూనిట్లకు చేరింది. అంటే కొనుగోలుదారులు వెనక్కి తగ్గుతున్నా, డెవలపర్లు కొత్త ప్రాజెక్టులను మార్కెట్‌లోకి తీసుకురావడం కొనసాగిస్తున్నారని ప్రాప్‌టైగర్ సీఈఓ ప్రకాష్ తేజ్వాని పేర్కొన్నారు.

# మధుబాలగా మారేందుకు?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ మధుబాల బయోపిక్‌ను అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ప్రకటించిన నాటినుంచీ.. మధుబాలగా మెప్పించే హీరోయిన్ ఎవరు? అనే ప్రశ్న బాలీవుడ్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ పాత్రలో ఫలానా హీరోయిన్ నటించనున్నదంటూ పలు హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి. అయితే.. చివరకు మధుబాల పాత్రకు 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్‌ని ఎంపిక చేసినట్టు సమాచారం. నటన, హావభావాలు, డ్యాన్స్ మూమెంట్స్, శరీరక భాష.. ఇలా అన్ని విషయాల్లోనూ మధుబాలను తలపించేందుకు సారా కఠినంగా శ్రమిస్తున్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటున్నదట. సంజయ్‌లీలా భన్సాలీ సినిమాలు ఎంత గ్రాండియర్‌గా ఉంటాయో తెలిసిందే. ఈ చిత్రాన్ని ఆయన నిర్మిస్తుండగా, జస్మీత్ కె.రీన్ దర్శకత్వం వహిస్తున్నారు.






# ఇంటర్వెల్ బ్యాంగ్ భాగ్యనగరంలో?

'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్. తన గత చిత్రాలకు భిన్నంగా, వైవిధ్యమైన కథ, కథనాలతో అత్యంత భారీగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలే ఉన్నాయి. మాఫియా నేపథ్యంలో ఓ డాన్ చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుందని సమాచారం. సైన్స్ ఫిక్షన్ అంశాలు కూడా ఈ కథలో ఉన్నట్టు వినికిడి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నది. ఈ షెడ్యూల్ అనంతరం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో మరో షెడ్యూల్‌ని దర్శకుడు అట్లీ ప్లాన్ చేశారు. దీనికోసం ఓ భారీ సెట్‌ని కూడా నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లోనే ఇంటర్వెల్ బ్యాంగ్‌ని చిత్రీకరిస్తారట. అలాగే, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తీస్తారని తెలిసింది. దీపిక పదుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మృణాళ్‌ఠాకూర్, జాన్వీ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పాన్‌ఇండియా సినిమాను నిర్మిస్తున్నది.



# స్వరాన్వేషణలో... 50 భాషల్లో 'వారణాసి' విడుదల

తెరపై కనిపించే తారలు వేరు... వాళ్లు పలికే సంభాషణలు పలికేవాళ్లు వేరు. మరి... తెరపై కనిపించే వ్యక్తి హావభావాలకు తగ్గట్టుగా సంభాషణలు పలికే వ్యక్తి కంఠస్వరం ఉండాలి కదా. ప్రస్తుతం రాజమౌళి అలా మ్యాచ్ అయ్యే 'వాయిస్'ల కోసం అన్వేషిస్తున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా తాను తెరకెక్కిస్తున్న 'వారణాసి' కోసమే రాజమౌళి దాదాపు పదిహేను వందల మంది వాయిస్ ఆర్టిస్ట్‌లను పరిశీలించి, మ్యాచ్ అయ్యేవారితో డబ్బింగ్ చెప్పించాలని అనుకుంటున్నారట. ఇంతకీ 1500 మంది ఆర్టిస్ట్‌లు ఎందుకు అంటే... 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 50 భాషల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని టాక్. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మిగతా భాషల్లోనూ అనువదించి, విడుదల చేస్తారు. సో... పాత్రలకు సరిగ్గా సరి పోయే గొంతులను ఎంపిక చేసి, ఆయా భాషల్లో డబ్బింగ్ చెప్పించాలనుకుంటున్నారట. ఇన్ని వాయిస్‌లంటే ఏఐ ద్వారా కూడా చేయొచ్చు. కానీ, భావోద్వేగాలు సహజంగా ఉండాలంటే మనుషులతోనే మాట్లాడించాలనుకుంటున్నారట. అందుకే 'రియల్ వాయిస్'లను ఎంపిక చేయాలనుకుంటున్నారని భోగట్టా. రాజమౌళి టీమ్ ప్రస్తుతం ఈ ఆడిషన్స్ చేసే పని మీద ఉందని తెలిసింది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మొత్తం 120 దేశాల్లో 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S) Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com